

ముక్కోటి దేవతలు ముందుండి నడవగా, మంగళవాయిద్యాలు శుభమంటూ మార్మోగగా, ఢమఢమ ఢమరుక శబ్దాలు, భేరీనాదాలు, పాంచజన్య ప్రణవనాదాలు, భక్తుల జయజయధ్వానాలతో ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం శోభాయమానంగా ప్రారంభమయ్యాయి. వేకువకు ముందే తరలివచ్చిన అశేష భక్తజనం ఆలస్యమైనా అలాగే ఎదురుచూస్తూ అమ్మ తొలిదర్శనం చేసుకుంది. బాలాదేవిగా కొలువుదీరిన దుర్గమ్మ దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించింది. నగరోత్సవ వైభవం.. సాంస్కృతిక వైభోగంతో ఇంద్రకీలాద్రి మరింత వెలుగులీనింది.

నేటి అలంకారం

శ్రీగాయత్రీదేవి







క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



చిన్నారికి సువాసినీ పూజ



ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ప్రారంభం

బాలా.. నిత్యకల్యాణశీల

- తొలి దర్శనానికి తరలివచ్చిన భక్తులు
- బాలాత్రిపురసుందరీదేవిగా అమ్మ దర్శనం
- వేకువజాము నుంచే కిటకిటలాడిన క్యూలైన్లు



విజయవాడ/చిట్టినగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 8 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అన్ని క్యూల్లోకి చేరుకున్నారు. దర్శనం కోసం 9 గంటల వరకు లైన్లలోనే వేచి ఉన్నారు. ఉచిత దర్శనంతో పాటు రూ.100, రూ.300, రూ.500 క్యూల్లో భక్తులు నిండుగా కనిపించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇదే పరిస్థితి కనిపించింది. గురువారం రాత్రి వరకు సుమారు 40 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు అంచనా వేశారు. వినాయకుడి ఆలయం నుంచి దర్శనానికి క్యూలోకి వచ్చిన భక్తులు అమ్మవారి గీతాలాపనలు, భజనలు చేసుకుంటూ కొండపైకి చేరుకున్నారు. భక్తులకు క్యూల్లోనే తాగునీరు, పిల్లలకు పాలు అందజేశారు. ఈ సేవలు చేయడానికి ఎస్ఎస్ఎస్, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు పోటీపడ్డారు. ఎక్కువమంది భక్తులు రూ.500 టికెట్లు కొన్నారు. ఈ ఏడాది కొండపై వాహనాల రద్దీ తక్కువగా కనిపించింది. పరిమిత సంఖ్యలో ఉన్న వాహనాలనే అనుమతించారు. కలెక్టర్ సృజన, పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు మోడల్ గెస్ట్‌హౌస్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రద్దీని పరిశీలిస్తున్నారు. ఇంద్రకీలాద్రిని మొత్తం సీసీ కెమెరాల్లో బంధించారు. కొండపై ఎగ్జిట్ ద్వారం నుంచి వీఐపీల ముసుగులో పాసులు వేసుకుని దర్శనాలకు అనధికారికంగా వెళ్లేవారు. దీనికి పోలీసులు పూర్తిగా అడ్డుకట్ట వేశారు. గతంలో ఈ ద్వారం వద్ద ఇన్‌స్పెక్టర్లు, డీఎస్పీలు విధులు నిర్వర్తించేవారు. ఈ దర్శనాలకు అడ్డుకట్ట వేయడానికి ఏడీసీపీ స్థాయి అధికారిని నియమించారు. రాజగోపురం నుంచి మెట్లు దిగిన భక్తులు ఎగ్జిట్ ద్వారం వైపునకు వెళ్లకుండా అన్ని గేట్లకు తాళాలు వేయించారు.





సాయం చేయండి

సార్..

- కలెక్టరేట్‌కు వెల్లువలా వరద బాధితులు
- ఇప్పటి వరకు 20 వేల కొత్త అర్జీలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ప్రభుత్వ సాయం కోసం కలెక్టరేట్‌కు ప్రజలు వస్తూనే ఉన్నారు. అర్జీలు సమర్పిస్తూనే ఉన్నారు. తమ ఇళ్లు కూడా ముంపునకు గురయ్యాయని, తమకెందుకు పరిహారం రావటం లేదో తెలియదని వేడుకుంటున్నారు. ఇలా దరఖాస్తులు చేస్తున్న వారిలో 90 శాతం మంది అనర్హులు ఉంటున్నారని జిల్లా అధికారులు చెబుతున్నారు. ఒక ఇంట్లో ఒక్కరికే సాయం అందుతుందని, మిగిలిన కుటుంబ సభ్యులు కూడా సాయం కోసం దరఖాస్తు చేసుకుంటున్నారంటున్నారు. ఎన్యూమరేషన్‌లో అర్హులమని గుర్తించినా సాయం రాకపోవటం వల్లే దరఖాస్తు చేయడానికి వచ్చామని చాలామంది చెబుతున్నారు. జక్కంపూడి, గొల్లపూడి, వాంబేకాలనీ, కండ్రిక, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి గురువారం పెద్దసంఖ్యలో కలెక్టరేట్‌కు వచ్చారు. దీంతో నాలుగు రోజులుగా దాదాపు 20 వేల వరకు దరఖాస్తులు వచ్చాయని తెలుస్తోంది.

తిరువూరు నియోజకవర్గాన్ని గాడిలో పెడతా : శావల దేవదత్

» తిరిగి టీడీపీ నియోజకవర్గ బాధ్యతల స్వీకరణ 6లో



నయనానందకరం.. నగరోత్సవం

లబ్బీపేట, అక్టోబరు 3 : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొలిరోజు గురువారం ఆదిదంపతుల నగరోత్సవం కనులపండువగా సాగింది. కనకదుర్గా నగర్ నుంచి ప్రారంభమైన ఉత్సవం ఘాట్‌రోడ్డు మీదుగా ఆలయానికి చేరుకుంది. మేళతాళాలు, డప్పువాద్యాలు, కేరళ వాయిద్యాలు, కోలాటాల నడుమ ఈ ఉత్సవం సాగింది. ఈ కార్యక్రమాన్ని వీక్షించి తరించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా, క్యూలైన్లలో ఉన్న భక్తులు సైతం తిలకించి పరవశించారు.

భక్తుల సౌకర్యాలపై నిరంతర పర్యవేక్షణ

దుర్గమ్మను దర్శించుకున్న కలెక్టర్ సృజన 6లో

ఆదాయమున్నా అరకొరే..!

- విజయవాడ రైల్వే డివిజన్‌కు ఆది నుంచి మొండిచేయే
- నేడు ఎంపీలతో రైల్వే జీఎం ప్రత్యేక సమావేశం
- డివిజన్ సమస్యలపై గళమెత్తనున్న ఎంపీలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆదాయార్జనలో దేశంలోనే టాప్-5లో ఉన్న విజయవాడ రైల్వే డివిజన్‌కు కేంద్ర ప్రభుత్వం మొండిచేయే చూపిస్తోంది. సామాన్య ప్రజల నుంచి వస్తున్న ఈ విమర్శలు ఎంపీలపై తీవ్ర ఒత్తిళ్లకు కారణమవుతున్నాయి. పేరుకు దేశంలోనే రెండో అతిపెద్ద రైల్వే జంక్షన్ అయినా.. విజయవాడ నుంచి నేరుగా నడిచే రైళ్లు చాలా తక్కువ. విజయవాడ మీదుగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పాసింగ్ త్రూ రైళ్లే ఎక్కువ. అయితే, ఇక్కడి నుంచి ఎక్కువ రైళ్లు నడపటానికి అవసరమైన కోచింగ్ డిపో లేదు. ప్రస్తుతం ఉన్న కోచింగ్ డిపోలో పిట్‌లైన్స్ ఆరు మాత్రమే ఉన్నాయి. ఈ పిట్‌లైన్స్‌ను ఇప్పుడున్న కోచింగ్ డిపోలో పెంచటం అసాధ్యం. మరో కోచింగ్ డిపోను ఏర్పాటు చేస్తే తప్ప సాధ్యంకాని పరిస్థితి. డిపో లేకపోవటం వల్ల కొన్ని రైళ్లను గుంటూరు, మరికొన్నింటిని కాకినాడ టౌన్, నరసాపురం, మచిలీపట్నం నుంచి నడపాల్సి వస్తోంది. ఐదేళ్లుగా విజయవాడ డివిజన్ పరిధిలో మెగా ప్రాజెక్టులే లేవు. ఎప్పుడో పదేళ్ల కిందట మంజూరు చేసిన డబ్లింగ్, ట్రిప్లింగ్ ప్రాజెక్టులు తప్ప.. కొత్త ప్రాజెక్టు ఒక్కటీ లేదు. అలాగే, విజయవాడ డివిజన్ పరిధిలో వందే భారత్ రైళ్లు తప్ప.. అవసరానికి తగ్గట్టుగా కొత్తవీ ప్రవేశపెట్టలేదు. ఈ అంశాలన్నింటినీ శుక్రవారం నగరంలో జరిగే సమావేశంలో మన ఎంపీలు రైల్వే జీఎం ముందుంచనున్నారు. ఎంతో ప్రాధాన్యమున్న విజయవాడ డివిజన్‌పై జరుగుతున్న ఈ నిర్లక్ష్యాన్ని ఈ సమావేశంలో జీఎం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరముంది.



దుర్గమ్మ చల్లని దీవెనలు ఉండాలని..




కుంకుమ పూజలో దంపతులు


వృద్ధులకు ప్రత్యేక లిఫ్ట్ సౌకర్యం

తొలి రోజు కొండంత భక్తితో..

56 మందితో ఉత్సవ కమిటీ

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలకు ఉత్సవ కమిటీ ఏర్పాటైంది. మొత్తం 56 మందితో ఉత్సవ కమిటీని ప్రభుత్వం గురువారం ప్రకటించింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను దేవదాయ శాఖ విడుదల చేసింది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతలకు కమిటీలో స్థానం కల్పించారు.


అమ్మవారి పల్లకీ ఊరేగింపు సేవలో అధికారులు


దుర్గమ్మ సేవలో హోంమంత్రి వంగలపూడి అనిత


ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

- శాఖల మధ్య సమన్వయంతో సాఫీగా దుర్గమ్మ దర్శనం
- అనధికార అంతరాలయ దర్శనాలకు బ్రేక్
- క్యూల వెంబడి వైద్య శిబిరాలు లేక భక్తుల ఇబ్బంది

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలలో తొలి రోజున పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఉత్సవాల నిర్వహణలో వివిధ శాఖల సమన్వయం కారణంగా అమ్మ దర్శనాలు ప్రశాంతంగా సాగాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రొటోకాల్ ఉన్న వారికి మినహా అంతరాలయ దర్శనాలను చాలావరకు నియంత్రించారు. ఈసారి వీఐపీల దర్శనాలను ఉదయం, సాయంత్రం నిర్ణీత సమయంలోనే అనుమతించటం వల్ల అంతరాలయ దర్శనాలు తగ్గాయి.

దృష్టి సారించాల్సిన అంశాలు ఇవీ..

క్యూలలో ఎమర్జెన్సీ ఎగ్జిట్స్ ఏర్పాటు చేసినా.. వాటిని బంధించి ఉంచారు. క్యూలలో భక్తులకు ఏదైనా జరిగితే వెంటనే వారిని బయటకు తీసుకురావటానికి సమయం పట్టే పరిస్థితులను కల్పించినట్టయింది. ప్రైవేటు సెక్యూరిటీని గానీ, పోలీసులకు గానీ అక్కడ డ్యూటీలు వేస్తే సమస్యలు సమస్యలు నివారించవచ్చు. క్యూలలో వెళ్లే భక్తుల కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆలయ మంటపంలో క్యూల నుంచి దుర్గమ్మను దర్శించుకునే భక్తులను ముందుకు నడిపించేందుకు అందరూ పురుషులే విధులు నిర్వహిస్తున్నారు. వారు మహిళల చేతులు పట్టుకుని లాగుతున్నారు. ఇది మహిళా భక్తులకు ఇబ్బందికరంగా ఉంది. క్యూల వద్ద మహిళా సిబ్బందికి విధులు కల్పించాల్సి ఉంది.

ఆదాయం రూ.20.25లక్షలు

వన్‌టౌన్ : దుర్గగుడిలో దసరా ఉత్సవాలు సందర్భంగా మొదటిరోజు గురువారం సాయంత్రం 5 గంటల వరకు రూ.20,25,000లు దేవస్థానానికి ఆదాయం వచ్చినట్టు ఈవో కేఎస్ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.500 టిక్కెట్ల ద్వారా 8,65000, రూ.300 టిక్కెట్ల ద్వారా 3,1500లు రూ.100 టిక్కెట్ల ద్వారా రూ.2,40,000, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.5,25,000, పరోక్ష, ప్రత్యక్ష కుంకుమార్చన పూజల (టిక్కెట్ రూ.3,000) ద్వారా రూ.12,000, పరోక్ష, ప్రత్యక్ష కుంకుమార్చన పూజల (టిక్కెట్ రూ.5,000) ద్వారా రూ.15,000, శ్రీచక్ర నవావరణార్చన పూజ ద్వారా రూ.3,000, కేశఖండన టిక్కెట్ ద్వారా రూ.50,000లు మొత్తం రూ.20,25,000 లు వచ్చినట్టు ఈవో తెలిపారు.


అంతరాలయం వద్ద దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఉత్తరాంధ్ర నుంచి భక్తుల రాక..

ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి ఈసారి పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. గతంలో నడుచుకుంటూ ఉత్సవాల ఐదో రోజుకు చేరుకునేవారు. ఈసారి ఉత్సవాల తొలిరోజు నుంచే హడావిడి నెలకొంది. ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి కాలినడకన దుర్గమ్మ చెంతకు భక్తులు వస్తున్నారు.

మాజీ హోంమంత్రి అయినా నిబంధనలు పాటించి..

విజయవాడ : శరన్నవరాత్రుల్లో వీఐపీల వాహనాలను కొండ మీదకు అనుమతించం.. వీఐపీలంతా పున్నమిఘాట్ వద్దకు చేరుకుని దేవస్థానం అధికారులు ఏర్పాటు చేసిన వాహనాల్లో దర్శనాలకు వెళ్లాలి.. ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ అధికారులు చేసిన ప్రకటన ఇది.. ఈ ఆదేశాలను మాజీ హోంమంత్రి, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాటించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి ఆయన తన వాహనంలో నేరుగా పున్నమిఘాట్‌కు వెళ్లారు. అక్కడి నుంచి దేవస్థానం ఏర్పాటు చేసి వాహనంలో ఇంద్రకీలాద్రిపైకి వెళ్లారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అదే వాహనంలో పున్నమిఘాట్‌కు వెళ్లారు. వీఐపీలంతా ఇలా చేస్తే సామాన్య భక్తులకు దర్శనాలు సాఫీగా జరుగుతాయని అధికారులు చెబుతున్నారు.


క్యూలైన్లలో వేచివున్న భక్తులు

క్యూలైన్‌లో మాజీ మంత్రి..

చిట్టినగర్ : మాజీ మంత్రి దేవినేని ఉమా ఉచిత క్యూలో అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ప్రతీఏడాది శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొలిరోజున అమ్మవారిని దర్శించుకుంటారు. వినాయకుడి ఆలయం నుంచి క్యూలో నడుచుకుంటూ కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రజలందరికి కనకదుర్గమ్మ ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.


అమ్మవారి అన్న ప్రసాదం


భక్తులకు లడ్డూల విక్రయాలు


రైలు, బస్సు స్టేషన్లలో రద్దీ..



బందరు అభివృద్ధికి నిధులు మంజూరు

- మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 3 : మచిలీపట్నం డంపింగ్ యార్డులోని చెత్తను రీ సైకిలింగ్ చేస్తూ ఆదాయ వనరులు సమకూరుస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబురాకతో బందరు ముఖచిత్రమే మారిపోయేలా వరాలు కురిపించారన్నారు. ప్రతి రోజూ వంద టన్నుల చెత్త వస్తుందని, ఇందుకు కోన రోడ్డులో 13 ఎకరాలు గుర్తించామని, రూ. 12 కోట్లతో చెత్తను సేకరించడంతో పాటు చెత్తను సెగ్రిగేట్ చేసి రూ. 3 కోట్లతో ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 84 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను ఏడాదిలో దశలవారీగా క్లియర్ చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎత్తిపోతల ద్వారా వర్షపు నీటిని డ్రెయిన్‌లో తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జలజీవన్‌మిషన్ కింద రూ.220 కోట్లు మంజూరయ్యాయని, టెండర్లు పిలిచి ఇంటింటికీ తాగునీటి కుళాయి అందిస్తామన్నారు. మంగినపూడి బీచ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. రాజధానికి దగ్గరగా ఉండే పోర్టును 2025 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామన్నారు. ఎంపెడా ద్వారా రూ. 200 కోట్లతో పథకాలు అమలు చేస్తామన్నారు. రోల్డుగోల్డు పరిశ్రమను ఎమ్మెస్ ఎంఈ కింద అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో గొర్రెపాటి గోపీచంద్, కుంచే నాని, ఎండీ ఇలియాస్ పాషా తదితరులు పాల్గొన్నారు.


జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న కొనకళ్ల నారాయణ

గత వైసీపీ పాలకులకు పట్టని డిపో సమస్యలు

- నూతన బస్సులు ప్రారంభించిన ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

గుడివాడ : గత పాలకుల కమీషన్ల కక్కుర్తి కారణంగానే గుడివాడ డిపో సమస్య పరిష్కారం కాలేదని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. గురువారం బస్టాండ్‌లో తిరుపతి, హైదరాబాద్, పల్లెవెలుగు బస్సులకు పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనకళ్ల మాట్లాడుతూ, గత పాలకులు డిపో మెరక పేరుతో రూ.9కోట్లు ఖర్చుచేసి పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడ్డారన్నారు. గుడివాడలో అధునాతన బస్టాండ్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, విజయవాడ జోన్ ఈడీ గోపినాథ్‌రెడ్డి, జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు అధికారి ఎ.వాణిశ్రీ, డిపో మేనేజర్ రాజేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, యలవర్తి శ్రీనివాసరావు, బూరగడ్డ శ్రీకాంత్, పిన్నమనేని బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గానగర్‌లో పోలీసుల అత్యుత్సాహం

- దుర్గగుడి ఇంజనీరింగ్ ఉద్యోగులపై దౌర్జన్యం
- పాసులు లాక్కున్న పోలీసులు

వన్‌టౌన్, అక్టోబరు 3 : దుర్గగుడిలో ఇంజనీరింగ్ ఉద్యోగుల పట్ల పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. గురువారం రాత్రి 10.30కు విధులకు హాజరైన ఉద్యోగులను పోలీసులు అడ్డుకున్నారు. అంతటితో ఆగకుండా వారి వద్ద ఉన్న పాసులను సైతం లాక్కున్నారు. విషయం తెలుసుకున్న దేవస్థానం ఈఈ రమ కనకదుర్గనగర్‌కు వెళ్లి తమ ఉద్యోగులను లోనికి అనుమతించమని కోరగా పోలీసులు ఆమెతో కూడా బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. పోలీసులు సుమారు అరగంట సేపు ఇంజనీరింగ్ ఉద్యోగులతో గొడవపడ్డారు. లాక్కున్న పాసులను వెనక్కి ఇవ్వకపోవడంతో ఈ వ్యవహారంపై ఈఈ రమపై అధికారులకు ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న ఉన్నతాధికారులు ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న కడపకు చెందిన డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సిబ్బందిని విధుల నుంచి తప్పించారు.

భక్తుల సౌకర్యాలపై నిరంతర పర్యవేక్షణ

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన



వన్‌టౌన్, అక్టోబరు 3 : ఇంద్రకీలాద్రిపై దసరా మహోత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవటానికి విచ్చేసే భక్తుల సౌకర్యాల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అన్నారు. ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా మొదటిరోజు బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో అమ్మవారిని ఆమె దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు మర్యాదలు కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ, సామాన్య భక్తుల సౌకర్యమే ప్రాధాన్యంగా ఏర్పాట్లు చేశామని, దేవస్థానం వాహనాల్లో వీఐపీలు, వికలాంగులు, వృద్ధులను కొండపైకి తీసుకువస్తున్నారని చెప్పారు. వీవీఐపీలకు, వీఐపీలకు అలాగే వృద్ధులు, దివ్యాంగులకు కూడా టైమ్ స్లాట్ కేటాయించామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ విషయంలో కూడా ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నట్టు తెలిపారు. రోజుకు లక్ష నుంచి లక్షన్నర వరకు భక్తులు వస్తారని అంచనా ఉందని, ఆమేరకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. మూలానక్షత్రం రోజు సీఎం చంద్రబాబు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు.


కలెక్టర్ డీకే బాలాజీకి మునిసిపల్ కమిషనర్ బాపిరాజు

కృష్ణా కలెక్టర్ డీకే బాలాజీకి సత్కారం

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం నగర పాలక సంస్థకు రాష్ట్ర స్థాయి అవార్డు వచ్చేందుకు సహకరించిన కలెక్టర్ డీకే బాలాజీకి మునిసిపల్ కమిషనర్ బాపిరాజు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ బాలాజీని మునిసిపల్ అధికారులు గురువారం కలెక్టర్ చాంబర్‌లో ఘనంగా సత్కరించారు. స్వచ్ఛతాహి సేవలో మచిలీపట్నం నగరం అవార్డుకు ఎంపికయింది. సహకరించిన జిల్లా కలెక్టర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్‌లు, స్వచ్ఛభారత్ ఇన్‌చార్జిలను అభినందించారు. స్వచ్ఛభారత్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, అశోక్‌లకు మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

నియోజకవర్గాన్ని గాడిలో పెడతా

- బాధ్యతలు చేపట్టిన దేవదత్

తిరువూరు, అక్టోబరు 3 : రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శిగా తిరువూరు నియోజకవర్గ బాధ్యతలను గురువారంశావల దేవదత్ చేపట్టారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు దేవదత్‌ను అభినందించారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని, పార్టీ అప్పగించిన బాధ్యతల్ని నాయకులు, కార్యకర్తల సహకారంతో పూర్తిచేస్తానని ఆయన పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో రాజకీయ సమీకరణ నేపథ్యంలో టీడీపీ అభ్యర్థిగా అధిష్ఠానం కొలికపూడి శ్రీనివాసరావును నిలపగా భారీ మేజార్టీతో విజయం సాధించారు. అయితే 100 రోజుల పాలనలో కొలికపూడిపై పలు వివాదాలు వస్తున్న నేపథ్యంలో, పార్టీ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఈ నేపథ్యంలో పరిస్థితుల్ని చక్కదిద్దేందుకు పార్టీ బాధ్యతలను గతంలో నియోజకవర్గ ఇన్‌చార్జిగా సమర్థవంతంగా పనిచేసిన దేవదత్‌కు తిరిగి అప్పగించారు.


దేవదత్‌ను అభినందిస్తున్న తిరువూరు నియోజకవర్గ టీడీపీ నేతలు


మృతి చెందిన గేదెలు, కంటైనర్, నుజ్జయిన ఆటో

కంటైనర్ బీభత్సం!

- నాలుగు గేదెలు మృతి - ఇద్దరికి తీవ్ర గాయాలు
- పోలీసుల అదుపులో డ్రైవర్

వీరులపాడు, అక్టోబరు 3 : మద్యం మత్తులో నిర్లక్ష్యంగా కంటైనర్ నడిపి బీభత్సం సృష్టించాడో డ్రైవర్. ప్రమాదంలో నాలుగు గేదెలు చనిపోగా.. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. జుజ్జూరు నుంచి చెన్నరావుపాలెం రహదారిలోని విశాఖ రేకుల ఫ్యాక్టరీలో ఫైబర్ దిగుమతి చేసుకొని రోడ్డెక్కిన కంటైనర్ జుజ్జూరు వదకు రాగానే ఒక్కసారిగా అదుపు తప్పి అప్పుడే మేతకు వెళ్లి వస్తున్న గేదెలను ఢీకొట్టింది. అంతటితో ఆగక ఓ ఆటోను ఢీకొట్టింది. ఏకకాలపు నాగరాజుకు చెందిన గేదె మృతి చెందగా మరో గేదెకు గాయాలయ్యాయి. జానకీ వెంకట నరసయ్యకు చెందిన ఒక గేదె, రెండు దూడలు చనిపోయాయి. జానకీ వెంకటనరసయ్యకు తీవ్ర గాయాలు కాగా ఆటోలో ఉన్న మహిళకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను కంచికచర్లలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.


కుటుంబసభ్యులను ఓదారుస్తున్న వేదవ్యాస్

భరత్ మృతదేహం గుర్తింపు


మృతుడు భరత్

కృత్తివెన్ను : పెదలంక డ్రెయిన్‌లో బుధవారం మధ్యాహ్నం ప్రమదావశాత్తు కాలుజారి పడి గల్లంతైన బాలుడి మృతదేహం గురువారం లభ్యమైంది. గరిసపూడిగ్రామానికి చెందిన దాసరి భరత్(17) పెదలంక డ్రెయిన్‌లో ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. అతడి ఆచూకీ కోసం పోలీస్, రెవెన్యూ, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. 50మీటర్ల దూరంలో భరత్ మృతదేహం లభ్యమైనట్టు కృత్తివెన్ను ఎస్సై పైడిబాబు తెలిపారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. గరిసపూడి గ్రామానికి చెందిన దాసరి వెంకటేశ్వర్లు పిల్లల చదువుల నిమిత్తం భీమవరంలో నివాసం ఉంటున్నారు. శుభకార్యంలో పాల్గొనే నిమిత్తం వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులతో కలిసి బుధవారం స్వగ్రామానికి వచ్చాడు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న భరత్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. టీడీపీ రాష్ట్రఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్, పలువురు నేతలు భరత్‌కు నివాళులర్పించి, కుటుంబసభ్యులను ఓదార్చారు.

న్యూస్ బాక్స్

అండర్ 14 క్రికెట్ జట్టు ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 23వ వరకు గుంటూరులో జరగనున్న అంతర్‌జిల్లాల అండర్-14 క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి కృష్ణాజిల్లా బాలుర జట్టును ఎంపిక చేసినట్టు కేడీసీఏ సెక్రటరీ పి. రవీంద్ర చౌదరి గురువారం ఒక ప్రకటనలో తె లిపారు. కోచ్‌గా ఎస్.రామ్‌కుమార్(గాంధీ) వ్యవహరిస్తారన్నారు.

జట్టు : డి.రోహన్ శివ్(కెప్టెన్), టి.భాను చైతన్య(వైస్ కెప్టెన్), కె.తమన్‌సాయి, ఎస్ హర్ష, నహీద్ చౌదరీ ఎం.మిచెల్, డి.భాను చంద్, కె.సాయి ఆశ్రిత్, జి.సంజిత్, సాయి చరణ్ గణేష్, పీవీ రామ్‌కిరణ్, ఎం.రుత్విక్, జి.రస్సెల్ రామ్‌లతో పాటు స్టాండ్‌బైలుగా.. జి.సాయి సహర్ష, ఎం.మోక్షజ్ఞ, ఎస్‌డీఎండీ ఉమర్, పి.చరణ్, ఎన్.హితేష్ సాయిలు ఎంపికయ్యారు.

ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలపై అవనిగడ్డ స్టేషన్‌లో ఫిర్యాదు

అవనిగడ్డ, అక్టోబరు 3 : ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు లేకుండా కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో యానిమల్ ఫ్యాట్ కలిసిందని తప్పుడు ప్రచారం చేస్తూ హిందువుల మత విశ్వాసాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కొంపెల్ల మాధవీలతపై న్యాయవాది బడే గౌతమ్ అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సామాజిక మాధ్యమాల్లో, మీడియాలో వారు విస్తృతంగా ప్రచారం చేశారని ఫిర్యాదులో ఆరోపించారు. ఫిర్యాదు కాపీని ఎస్పీ కార్యాలయానికి పంపించారు.

కిడ్నీ వ్యాధితో మహిళ మృతి


గుగులోతు సోనికి

గంపలగూడెం : కిడ్నీ వ్యాధితో మహిళ గురువారం మృతి చెందింది. వినగడప గ్రామ శివారు వినగడప తండాకు చెందిన గుగులోతు సోనికి (50) పదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతోంది. రెండేళ్లుగా వ్యాధి తీవ్రం కావడంతో ఇంటి వద్దనే ఉంటూ మృతి చెందింది. సోనికి భర్త కేశియ 15 ఏళ్ల క్రితం కిడ్నీ వ్యాధితోనే మృతి చెందాడు. అప్పటి నుంచి కుటుంబ బాధ్యతలు సోనికి నిర్వహిస్తుంది. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

పీఆర్ ఏఈకి సత్కారం

కూచిపూడి : మొవ్వ మండల పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఏఈ బి.రామారావు పామర్రు మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఆయనను మొవ్వ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గురువారం పుష్పగుచ్చాలు శాలువాలతో సత్కరించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	126, 135, 146
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 535

స్వర్ణకార మార్కెట్‌లో దసరా మహోత్సవాలు ప్రారంభం



వన్‌టౌన్, అక్టోబరు 3: స్థానిక స్వర్ణకార మార్కెట్‌లో గురువారం నవ్యాంధ్ర స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. విజయవాడ స్పెషల్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ దేవు నరసింహారావు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర స్వర్ణసంఘం కృష్ణాజిల్లా సెక్రటరీ జి.సూర్యప్రకాష్, నవ్యాంధ్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు జింకా దివ్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా దసరా మహోత్సవాలు

చిట్టినగర్, అక్టోబరు 3: పాతబస్తీలో దసరా మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజైన గురువారం పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు దేవాలయాల వద్ద బారులు తీరారు. చిట్టినగర్‌లో ఉన్న శ్రీ కొత్తమ్మవారు మహాలక్ష్మిదేవి అలంకారంలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ సహాయ కార్యదర్శి పొట్నూరి దుర్గాప్రసాద్(రాజా), సత్యవతి దంపతులు కలశ స్థాపన చేయగా, లింగిపిల్లి రామకృష్ణ, శ్రీదేవి దంపతులు అమ్మవారికి పట్టు సారెను సమర్పించారు. అనంతరం ముత్తైదువులకు పసుపు,కుంకుమ అందజేశారు. కోమలవిలాస్ సెంటర్ రామాలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో మజ్జి శ్రీనివాసరావు, శ్రీదేవి దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా అధ్యక్ష కార్యదర్శులు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● చిట్టినగర్‌లో ఉన్న మహాలక్ష్మి అమ్మవారిని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం చేయించి ప్రసాదాలను అందజేశారు.

● పాలఫ్యాక్టరీ ఎదురుగా ఫ్లైఓవర్ సమీపంలోని విజయదుర్గా రామలింగేశ్వరస్వామి, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో అమ్మవారు విజయదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ నిర్వహకులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పర్యవేక్షించారు. ● కొత్తపేటలో ఉన్న గంగానమ్మ ఆలయంలో మంగళగౌరి అమ్మవారు బాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ● వీఎంసీ కాలనీలో ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారు కనకదుర్గమ్మ అలంకారంలో భక్తులకు దర్శంచుకున్నారు. మహిళలు పూజలు నిర్వహించారు.

భక్తులతో కళకళలాడిన ఆలయాలు



మహాలక్ష్మిదేవి అలంకారంలో చిట్టినగర్ కొత్తమ్మవారు, దర్శనానంతరం మేయర్ భాగ్యలక్ష్మికి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేస్తున్న కమిటీ సభ్యులు, విజయదుర్గా దేవి అలంకారంలో అమ్మవారు

బాలా త్రిపుర సుందరీ దేవిగా శ్రీ శివకాళేశ్వరి అమ్మవారు

పాతరాజరాజేశ్వరి పేట: స్థానిక 34వ డివిజన్ కేదారేశ్వరపేట శ్రీ శివకాళేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రీ దేవినవరాత్రుల మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు కట్టా బాబ్జి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఈ కార్యక్రమంలో దేవస్థానం పెద్దలు వీవీ రమణరావు, కేటీ రాజు, చింతల. లక్ష్మయ్య, వై. రత్న, ఆర్. రాజు, వికె. పద్మనాభం, కన్నా రాజు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌లకు అండగా ఉంటాం

ఆటోస్టాండ్ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె

మొగల్రాజపురం, అక్టోబరు 3: ఆటోడ్రైవర్‌లకు ఏ మాత్రం చిన్న ఇబ్బంది వచ్చినా వారిని ఆదుకునేనిది ఒక్క టీడీపీనే అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ స్పష్టం చేశారు. గురువారం రమేష్ ఆసుపత్రి వద్ద కొత్త అమరావతి ఆటోస్టాండ్‌ను ఆయన ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మధ్య తరగతి ప్రజలను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చే ఆటో వాలాలకు సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం ఉండాలన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్‌లు నష్టపోతారని వైసీపీ చేస్తున్న ప్రచారం వల్ల ఎవరూ భయభ్రాంతులకు గురవ్వాల్సిన పని లేదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమరావతికి మహర్దశ వచ్చిందని, ఆటో డ్రైవర్‌లకు కిరాయిలు కూడా పెరిగాయని ఇంకా పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, రాయవరపు అశోక్, నూతక్కి రామ్మోహన్, మొకరా అదిబాబు, మిరియాల సుబ్రహ్మణ్యం, జాస్తి శ్రీను, ఎస్.షరీఫ్, లోడంగి రమేష్, వాజి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



ఆటోస్టాండ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, గొట్టుముక్కల రఘురామరాజు తదితరులు

టీఎన్‌టీయూసీలో చేరిక

రాణిగారితోట, అక్టోబరు 3: వారధి వద్ద వైసీపీకి చెందిన జైదుర్గా భవాని వారధి సర్కిల్ ఆటో స్టాండ్ కార్మికులు, శ్రీ కనకదుర్గ ఆటో స్టాండ్ కార్మికులు గురువారం గద్దె క్రాంతి కుమార్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు నేతృత్వంలో టీఎన్‌టీయూసీలో చేరారు. ఈ సందర్భంగా టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ఎప్పుడూ గద్దె రామ్మోహన్ కృషి చేస్తారని అన్నారు. ఈకార్యక్రమంలో టీఎన్‌టీయూసీ తూర్పు అధ్యక్షుడు రాయవరపు అశోక్, మొకర ఆదిబాబు, వేముల దుర్గారావు, రాయి రంగమ్మ పాల్గొన్నారు.

గద్దె క్రాంతి పూజలు

కృష్ణలంక: కృష్ణలంకలోని దసరా శరన్నవరాత్రుల పందిరిలో గద్దె క్రాంతి పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.



కేబీఎన్‌లో ఘనంగా ప్రారంభమైన చండీయాగం



వన్‌టౌన్, అక్టోబరు 3: కన్యకాపరమేశ్వరి, విస్సంశెట్టి వెంకటరత్నం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో దసరా మహోత్సవాల సందర్భంగా గురువారం రుద్ర సహిత ద్విశత చండీయాగ మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. మొత్తం 200 చండీయాగాలను చేయాలని సంకల్పించారు. తొలిరోజు బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారానికి సంబంధించి మూల మంత్ర సంపుటితో చండీహోమం చేశారు. 108 మంది మహిళలు లలితా సహస్రనామ సంపుటితో కుంకుమార్చనలో పాల్గొన్నారు. కేబీఎన్ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల బాధ్యులు తొమ్మండ్రు శేషయ్య, గోపిశెట్టి మల్లయ్య, గోళ్ల బాబా విజయకుమార్, ఉసిరిక ఉమామహేశ్వరరావు, తూనికుంట్ల శ్రీనివాస్, చలువాది మల్లిఖార్జునరావు, చిట్టా అమర్ సుధీర్, తదితరులు పూజల్లో పాల్గొన్నారు. పక్కనే ఉన్న ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజాదిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

వెంకటేశ్వరస్వామి గుడిలో ...

వన్‌టౌన్, అక్టోబరు 3: స్థానిక బ్రాహ్మణ వీధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు పద్మావతి అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.ఆలయ ప్రధాన అర్చకులు పానంగిపల్లి శ్రీరామచంద్ర మూర్తి ఆధ్వర్యంలో పూజాదికాలు నిర్వహిస్తున్నారు. ఈవో కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ● స్థానిక భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లో గురువారం దసరా మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారు రజిత కవచాలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఈవో నటరాజ్ షణ్ముగం కార్యక్రమాలను పర్యవేక్షించారు.



వెంకటేశ్వరస్వామి ఆలయంలో, పాత శివాలయంలో

సత్యనారాయణపురం: అయోధ్యనగర్‌లోని శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యంలో శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. శివకామేశ్వరి అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. పీఠం వ్యవస్థాపకులు అవ్వాహెమసుందర వరప్రసాద్ లోకకళ్యాణార్థలు పిఠాపురంకు చెందిన వేదపండితులచే విశేషంగా హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ● ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి నవరాతిఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.అమ్మవారిని రజితకవాచాలంకృత కదుర్గాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బాధితులను ఆదుకోవడం అభినందనీయం

● ఎమ్మెల్యే సుజనా చౌదరి



భవానీపురం, అక్టోబరు 3 : వరద బాధితులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రౌండ్ టేబుల్ ఇండియా సంయుక్తంగా ఆదుకోవడం అభినందనీయమని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. ఊర్మిళానగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో రౌండ్‌టేబుల్ ఇండియా, ఎస్‌బీఐ కార్ప్స్ ఆధ్వర్యంలో రూ.60 లక్షల వ్యయంతో 3600 మంది వరద బాధితులకు నిత్యావసరాల కిట్ల పంపిణీని ఎమ్మెల్యే గురువారం చేపట్టారు. టీడీపీ సీనియర్ నాయకులు బొమ్మసాని సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా ఛైర్మన్ మక్సూద్ అహ్మద్, వైస్ ఛైర్మన్ యెక్కల కౌశిక్, నాదెళ్ళ ఆదిత్య, మణర్ సేఠీ, అశ్విన్, టీడీపీ సీనియర్ నాయకులు మోరబోయిన రాంబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, పగడాల కృష్ణలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు శ్రీ చైతన్య విద్యార్థులు

మాచవరం, అక్టోబరు 3 : నగరంలోని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో అండర్ 19 తైక్వాండో పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థులు యు.శ్యామ్‌కుమార్, బి. కృతిక, ఎం. భానుప్రియ బంగారు పతకాలు సాధించారు. గురువారం రవీంద్రనాథ్ ఠాగూర్ భవన్‌లో పతకాలు పొందిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య కళాశాల డీన్ గుంటూరు హరిబాబు మాట్లాడుతూ ఈనెల 4, 5 తేదీల్లో కడప జిల్లా రైల్వే కోడూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు వీరు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో ప్రిన్సిపాల్ నిజాంపట్నం గోకర్ణేశ్వరరావు, ఏజీఎం కొమ్మినేని రంగారావు, కోచ్ పి. గౌరీశంకర్ ఉన్నారు.

ఉచిత ఇసుక హామీలు అమలు చేయాలని డిమాండ్

పటమట, అక్టోబరు 3 : ఉచిత ఇసుక హామీను వెంటనే అమలు చేయాలని కార్పెంటర్స్ వర్కర్స్ యూనియన్, సిఐటీయూ విజయవాడ తూర్పు నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం పటమటలంక సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం నాయకుడు పుప్పాల కృష్ణ కరపత్రాలను ఆవిష్కరించారు. సీఐటీయూ నాయకులు వీబీ రాజు మాట్లాడుతూ శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు ఆందోళన చేస్తున్నట్లు వివరించారు. యూనియన్ నాయకులు వేణుగోపాలకృష్ణ, సురేష్, కరీముల్లాలు పాల్గొన్నారు.

చేపల మార్కెట్ వద్ద నుంచి వైన్‌షాపును తరలించండి

పటమట, అక్టోబరు 3 : పటమటలంకలోని 9వ డివిజన్ చేపల మార్కెట్ వద్ద ఉన్న వైన్‌షాపును తరలించాలని నగర సీపీఐ సహాయ కార్యదర్శి లంకదుర్గారావు ఆధ్వరంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. దుర్గారావు మాట్లాడుతూ ఈ వైన్‌షాపు వలన మందుబాబులు నిత్యం రోడ్డు మీద మద్యం తాగి గొడవలు చేయడం, ఆ రోడ్డులో వెళ్లే మహిళలు, విద్యార్థులతో అసభ్యంగా ప్రవరించడం, రోడ్డు మీద అడ్డదిడ్డగా వాహనాలు నిలపడం, ప్రశ్నించిన వారితో గొడవ పడడటం జరుగుతుందని వివరించారు. ఈ సమస్యపై కార్పొరేటర్ క్రాంతిశ్రీని కలిసి వినతి పత్రం అందించారు. సీపీఐ కార్యవర్గసభ్యులు దోనేపూడి సూరిబాబు, మహిళా సమాఖ్య నాయకురాలు నాగమణి, నాయకులు అజయ్, త్రిమూర్తులు పాల్గొన్నారు.

మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి

రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా జానీ పాషా



జానీపాషాకు నియామక పత్రం అందజేస్తున్న షబ్లీ

వన్‌టౌన్, అక్టోబరు 3: రాష్ట్రంలోని మైనార్టీ ఉద్యోగుల సంక్షేమం, వారి చట్టపరమైన హక్కుల పరిరక్షణ కోసం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎండీ జానీపాషాను సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షబ్లీ నియమించారు. గురువారం ఈ మేరకు ఆయనకు నియామకపత్రం అందచేశారు. ఈ సందర్భంగా తనను నియమించిన ఫారూఖ్ షబ్లీకి జానీపాషా ధన్యవాదాలు తెలిపారు.

పారిశుధ్య కార్మికుల వేతనాల్లో కోతలు అన్యాయం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు

అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం, అక్టోబరు 3 : బుడమేరు వరద కారణంగా ఇల్లు నీట మునిగి విధులకు హాజరు కాలేని పారిశుధ్య కార్మికుల వేతనాల్లో కోతలు విధించడం అన్యాయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్. బాబూరావు విమర్శించారు. అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లోని పారిశుధ్య కార్మికులతో గురువారం ఆయన మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 15 రోజుల పాటు వరద ముంపు ప్రాంతాల్లో ఉన్న అనేక మంది పారిశుధ్య కార్మికులు ఆర్థికంగా నష్టపోయారన్నారు. ఆ సమయంలో కార్మికులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వారి వేతనాల్లో కోత విధించడం దారుణమన్నారు. ప్రభుత్వం 15 రోజుల పూర్తి వేతనాలను కార్మికుల ఖాతాల్లో వేసి వారికి వరద సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

మానవ హక్కుల కమిటీ సభ్యుడిగా న్యాయవాది రాజు



వన్‌టౌన్, అక్టోబరు 3: మానవ హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడిగా భవానీపురం హెచ్‌బీ కాలనీకి చెందిన బార్ అసోసియేషన్ సభ్యుడు వి.ఎన్.రాజు నియామకమయ్యారు. గతంలో ఈయన బీసీఏ హ్యూమన్ రైట్స్ కమిటీలో కూడా కన్వీనర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా బీసీఏ ప్రెసిడెంట్ కొత్త చంద్రమౌళి, జనరల్ సెక్రటరీ అరిగల శివరామ్ ప్రసాద్ కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.

స్వర్ణ కవచాలంకరణలో పోలేరమ్మ

● సాయిబాబా గుడిలో కుంకుమ పూజలు



భవానీపురం, అక్టోబరు 3 : ఊర్మిళానగర్‌లోని పోలేరమ్మగుడిలో 38వ దసరా శరన్నవరాత్రులు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. పోలేరమ్మ స్వర్ణకవచా లంకరణలో భక్తులు పూజలందు కున్నారు. గంటి సన్యాసరావు ఆధ్వ ర్యంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సూరసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వినియోగం జరిగింది.

సంకల్పసిద్ధి షిర్డి ఆలయంలో కుంకుమ పూజలు

హెచ్‌బీ కాలనీ సంకల్ప సిద్ధి షిర్డి సాయిబాబా ఆలయంలో దసరా ఉత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. మొదటిరోజు అమ్మవారు బాల త్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాల వినియోగం జరిగింది.

బాలా త్రిపురసుందరీ దేవిగా మరకత రాజరాజేశ్వరి



పటమట, అక్టోబరు 3 : పటమట దత్తపీఠం మరకత రాజరాజేశ్వరి ఆలయంలో గురవారం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. తొలి రోజు అమ్మవారు బాలా త్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. 9 రోజులు తీర్థప్రసాదాల వినియోగంతో పాటు, నిత్యాన్నదానం నిర్వహిస్తున్నామన్నారు.

రజిత కవచాలంకార కాళీమాతగా అమ్మవారు



కృష్ణలంక, అక్టోబరు 3: దసరా శరన్నవ రాత్రుల మొదటి రోజైన గురువారం త్రిశక్తిపీఠంలోని అమ్మవారు రజిత కవచాలంకార కాళీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. చండీహోమం, భక్తులతో లలితా సహస్రనామంతో విశేష కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరీ దేవిగా ధనకొండ అమ్మవారు



మొగల్రాజపురం, అక్టోబరు 3: దసరా మహోత్సవాలు మొగల్రాజపురం ధనకొండ మీద గురువారం ప్రారంభం అయ్యాయి. శ్రీశ్రీశ్రీ దుర్గా భవానీ అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (కేజీలలో)

బ్రాయిలర్ బర్డ్	126,135, 146
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.535

కొత్తూరులో ట్రాక్టర్ డ్రైవర్ గల్లంతు


నాగరాజు

విజయవాడ రూరల్, అక్టోబరు 3 : విజయవాడ రూరల్ మండలం కొత్తూరు గ్రామ శివారుల్లోని క్వారీ నీటి గుంటలో పడి ఓ వ్యక్తి గల్లంతైన ఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం కొత్తూరుకు చెందిన కూరపాటి నాగరాజు(29) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం 6 గంటల సమయంలో ఊరి శివారులోరి క్వారీల వైపుకు వెళ్లి, తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన కోసం వెతకగా క్వారీ ప్రాంతంలో నాగరాజు చెప్పులు, ఫోను లభించాయి. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు టూటౌన్ పోలీసులు, కొత్తపేట ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్వారీల వద్ద ఉన్న గోతుల్లో గురువారం సాయంత్రం వరకు వెతికించారు. ప్రయోజనం లేకపోవడంతో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. శుక్రవారం మరో మారు వెతికేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి


జగ్గయ్యపేట:పట్టణ శివారు విద్యానగర్ కాలనీలో బుధవారం రాత్రి పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.44,410లు నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

విద్యార్థిని ఆచూకీ లభ్యం

జగ్గయ్యపేట:పట్టణంలో కనిపించకుండాపోయిన కాకానినగర్‌కు ఇంటర్ విద్యార్థిని ఆచూకీ లభ్యమైనట్టు జగ్గయ్యపేట ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. కళాశాలకు వెళ్లి తిరిగి రాకపోవటంతో నాలుగు రోజుల క్రితం కనిపించకుండా వెళ్లటంతో తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ధర్యాప్తు నిర్వహించారు. విద్యార్థిని తల్లి అకారణంగా మందలించటంతో చిల్లకల్లులోని పెద్దనాన్న ఇంటికి వెళ్లిందని ఎస్సై చెప్పారు. బాలికను తల్లికి అప్పగించామని చెప్పారు.

ఉత్సవ కమిటీలో బీజేపీ నేతకు చోటు

విస్సన్నపేట: విజయవాడ శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం నిర్వహించే దసరా ఉత్సవ కమిటీలో విస్సన్నపేటకు చెందిన బీజేపీ నాయకుడు గుత్తా శివ సుబ్రహ్మణ్యంబాబుకు చోటు లభించింది. ఈ సందర్భంగా విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరికి సుబ్రహ్మణ్యం కృతజ్ఞతలు తెలిపారు.


రజిత కవచాలంకారంలో సత్యమ్మ


పెనుగంచిప్రోలులో..


గొల్లపూడిలో..


తిరువూరులో..

వైభవంగా నవరాత్రులు

- శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు
- పెనుగంచిప్రోలులో అమ్మవారి విగ్రహాల ఊరేగింపు

నందిగామరూరల్, అక్టోబరు 3 :మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయంలో అర్చకులు అమ్మవారిని రజత కవచాలంకారంలో అలంకరించి విశేష పూజలు చేశారు. ఈవో హరిగోపీనాద్ పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు.

నందిగామ: పట్టణంలోని శ్రీరామలింగేశ్వరస్వామివారి ఆలయంలో శ్రీశుకశ్యామలాంబ దేవికి గురువారం రజిత కవచ అలంకారం చేశారు. ఆలయ అర్చకులు బాలకృష్ణ శాస్త్రి, ప్రసాద్‌శర్మ, పవన్‌కుమార్, బసవయ్యల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు

తిరువూరు: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శాంతి నగర్ శ్రీకనకదుర్గాదేవి ఆలయంలో, అమ్మవారు గురువారం బాలత్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు.

పెనుగంచిప్రోలు : శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంతోపాటు గ్రామంలోని పలు సెంటర్లలో శ్రీ కనకదుర్గ అమ్మవారి విగ్రహాలను మేళతాళాలు మంగళవాయిద్యాలతో ఊరేగించి పందిళ్లలో ప్రతిష్ఠించారు.

జగ్గయ్యపేటరూరల్: భవానీ సమేత ముక్త్యేశ్వరస్వామి వారి ఆలయంలో భవానీ అమ్మవారు బాలాత్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో కానూరి సురేష్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ధర్మకర్త డాక్టర్ వెలగపూడి లక్ష్మణ ఇందిరాదత్ సౌజన్యంతో పూజలు చేస్తున్నట్లు చెప్పారు.

గంపలగూడెం: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలోని రాజ్యలక్ష్మీ అమ్మవారు, ఊటుకూరు కోదండ రామాలయంలోని రాజ్యలక్ష్మీ అమ్మవారు, పెనుగోలను శివారు మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలోని గజలక్ష్మి అమ్మవారు ఆదిలక్ష్మి అమ్మవార్లుగా దర్శనమిచ్చారు.

ఇబ్రహీంపట్నం: కొండపల్లిలో వేంచేసియున్న శ్రీమద్విరాట్ విశ్వకర్మ దేవాలయంలో శ్రీ కామాక్షి అమ్మవారు గురువారం బాల త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ఆలయ ట్రస్టీ మద్దు వెంకట రామలింగేశ్వరరావు - రమా సుమన్, కత్తురోజు రామకృష్ణ - సరస్వతి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

రెడ్డిగూడెం:మండలంలోని రెడ్డిగూడెం, మద్దులపర్వ, కూనపరాజుపర్వ, తాడిగూడెం, నాగులూరులలో అమ్మవారి నవరాత్రులు గురువారం ప్రారంభమయ్యాయి.

జగ్గయ్యపేట:పట్టణంలోని వెండి దేవాలయంలో శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో, ఆర్టీసీ కాలనీలో శ్రీ సత్తెమ్మ అమ్మవార్లు బాల త్రిపుర సుందరీగా దర్శన మిచ్చారు.

గొల్లపూడి: గొల్లపూడిలోని సాయిబాబా మందిరంలో గురువారం మందిర అధ్యక్షుడు రావూరి కిషోర్ దంపతులు ప్రత్యేక పూజలుచేశారు.చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, కాజ కృష్ణారావు, నాగేశ్వరరావు, రామయ్య, పాల్గొన్నారు.

విస్సన్నపేట: విస్సన్నపేట శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రుల సందర్భంగా శ్రీ బాలత్రిపుర సుందరీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పి.రామకృష్ణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జగ్గయ్యపేట: దుర్గాపురంలో వేంచేసియున్న శ్రీ దుర్గాదేవి అమ్మవారికి మాజీ ప్రభుత్వవిప్, జనసేన నేత సామినేని ఉదయభాను సతీమణి సామినేని విమలాభాను అమ్మవారికి పట్టువస్త్రాలు అందచేశారు.

వరద బాధితులకు నిత్యావసరాలు

గొల్లపూడి:వరద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ అన్నారు.ఎస్‌బీఐ కార్డ్ అండ్ పేమెంట్ సర్వీసెస్ లిమిటెడ్, రౌండ్ టేబుల్ ఇండియా ట్రస్టు వారి సంయుక్త సౌజన్యంతో జెఎన్ఎన్‌యుఆర్ఎమ్ కాలనీలోని వరద బాధితులకు గురువారం ఆయన నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు స్వయంగా వరద ప్రాంతాల్లో తిరిగి ధైర్యం చెప్పారు. పరిహారం ఇచ్చి ఆదుకున్నారని అన్నారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్బారావు, పాల్గొన్నారు.


కిట్స్ అందిస్తున్న ఎమ్మెల్యే వసంత

మెరుగైన సేవలే లక్ష్యం

జగ్గయ్యపేట: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన వార్డు సచివాలయాల్లో ఉద్యోగులు తదనుగుణంగా పనిచేయకపోతే సస్పెండ్ చేస్తామని మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర హెచ్చరించారు. గురువారం ఆయన 13, 14 సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సమస్యలపై వచ్చిన ప్రజలకు అంది స్తున్న సేవలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. వైస్‌చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్ పేరం సైదేశ్వరరావు, వెంకట్, పుల్లారావు పాల్గొన్నారు.


రికార్డుల తనిఖీలు

విజయవాడకు బస్సు సర్వీసులు

జగ్గయ్యపేట:జగ్గయ్యపేట నుంచి విజయవాడకు నూతనంగా ఏర్పాటు చేసిన 3 ఎక్స్ ప్రెస్ సర్వీసులను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య గురువారం ప్రారంభించారు. ఆర్టీసీ బస్టాండులో సౌకర్యాలు పెంచాలని అధికారులకు సూచించారు. మునిసిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కట్టా నరసింహారావు, మైనేని రాధాకృష్ణ, కర్రి చిన్నా, రావూరి శ్రీను, సంగెపు బుజ్జిబాబు, గింజుపల్లి వెంకట్రావు, పేరం సైదేశ్వ రరావు, పుల్లారావు, శేషగిరి, డీఎం రఘురాం పాల్గొన్నారు.


బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

రైతులను ఆదుకోవాలి : సీపీఎం

జగ్గయ్యపేట రూరల్: పాలేటి వరద నీటితో తీవ్రంగా నష్టపోయిన నదీ పరివాహక గ్రామాల రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ పేర్కొన్నారు. నదీ పరివాహక గ్రామాలైన తక్కెళ్లపాడు, బలుసుపాడు, రెడ్డినాయక్‌తండ, బూదవాడలలో గురువారం ఆయన పర్యటించారు. మంత్రులు, అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. శ్రీనివాస్, శేషు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


వ్యవసాయ భూమిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ముక్కపాటికి నివాళి

జగ్గయ్యపేట: కాకతీయ సేవాసమితి మాజీ అధ్యక్షుడు, చింతా మణి అభయాంజనేయస్వామి వారి దేవస్థాన గౌరవసలహాదారు ముక్కపాటి జానకీరామయ్య గురువారం మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటి సభ్యులు నెట్టెం శివరాం, కాకతీయ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు రంగారావు, సుబ్బారావు నివాళులు అర్పించారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగ్గయ్యపేట:పట్టణంలో చెరువుబజార్‌లో ఆంజనేయస్వామి గుడి వద్ద బంగారుపేట కాలనీలో మంగళవారం రాత్రి వచ్చిన ఈదురు గాలులతో కూడిన గాలివానకు చెట్టు పడి సూరబోయిన ఆదాం అనే వ్యక్తి కారు ధ్వంసమైంది. మత్స్యకార వృత్తిచేసే అతను కారును కొనుగోలుచేసి నడుపుకుంటున్నాడు. చెట్టు కూలడంతో అతని ఆల్టో కారు బాగా దెబ్బతింది. విషయం తెలుసుకుని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఆయన సోదరుడు చినబాబులు పరామర్శించారు.

రిటైర్డ్ హెచ్ఎం మృతి

కంచికచర్ల: కంచికచర్ల అరుంధతి నగర్‌కు చెం దిన శతాధిక వృద్ధురాలు, రి టైర్డ్ ఉపాధ్యాయురాలు య ద్దనపూడి మాణిక్యమ్మ గురువారం మృతి చెం దారు. రిటైర్డ్ ఉపాధ్యాయు లు ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వివాహిత ఆచూకీ లభ్యం

జగ్గయ్యపేట:పట్టణంలో మార్కండేయస్వామి వీధికి చెందిన వివాహిత (27) మిస్సింగ్ మిస్టరీ వీడింది. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన పోలీసులు ఆమె సామాజిక మాధ్యమాల ఖాతాలను పరిశీలించారు. కర్నూల్‌లో ఉన్నట్టు గుర్తించి తీసుకుని వచ్చారు. ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్న ఆమె భర్తకు అప్పగించినట్టు ఎస్సై చెప్పారు.

7 నుంచి బస్ పాస్‌లు

తిరువూరు: సాంకేతికపరమైన కారణంతో తిరువూరు ఆర్టీసీ డిపో పరిధిలో ఈనెల 7వ తేదీన బస్సు పాస్‌లు జారీచేయనున్నామని డిఎం వేణు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.